

# రమణ భాస్కర

ఆధ్యాత్మిక పక్షపత్రిక

20-3-2001 ⑦



## శ్రీ రమణ క్షేత్రం - జిన్నూరు

పశ్చిమ గోదావరి జిల్లా - ఆంధ్రప్రదేశ్. పిన్ : 534 265

# సద్గురు శ్రీనాన్న గారి అనుగ్రహ భాషణములు

| | |
|---|---|
| 21-3-2001, బుధవారం | యండగండి |
| 25-3-2001, ఆదివారం | కోపల్లె |
| 30-3-2001, శుక్రవారం | జిన్నూరు - శ్రీ రమణ క్షేత్రం. |
| 2-4-2001, సోమవారం | పాలకోడేరు రామాలయంలో - శ్రీ రామనవమి |
| 3-4-2001, మంగళవారం | భీమవరం - ఆదర్శ నగర్ |
| 4-4-2001, బుధవారం | చింతపల్లి (దువ్వ - చిలకంపాడు మధ్య) |
| 11-4-2001, బుధవారం | ఐ-భీమవరం |
| 13-4-2001, శుక్రవారం | భీమవరం - సీతారామరాజు కళ్యాణ భవనం |
| 19-4-2001, గురువారం | పాలకొల్లు - పెన్మెత్స సత్యనారాయణ రాజు & సూర్య పద్మావతి క్షత్రియ సంక్షేమ పరిషత్ కళ్యాణ మండపం |

## కాస్మో కల్చరల్ స్పోర్ట్స్ కాంప్లెక్స్, పాలకొల్లులో ఆంధ్రకేసరి ఓపెన్ టెన్నిస్ పోటీలు



కాస్మో కల్చరల్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో విజేతలను అభినందిస్తున్న కాంప్లెక్స్ సభ్యులు

పాలకొల్లు కాస్మో కల్చరల్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో తొలిసారిగా ఆంధ్రకేసరి ఓపెన్ టెన్నిస్ పోటీలు అత్యంత వైభవంగా జరిగాయి. ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన జాతీయ క్రీడాకారులు ఈ పోటీలలో పాల్గొన్నారు. సద్గురు శ్రీ నాన్నగారు శంఖుస్థాపన చేసి ప్రారంభించిన ఈ స్పోర్ట్స్ కాంప్లెక్స్ దేశ వ్యాప్తంగా గుర్తింపు పొందటం విశేషం.

35 సంవత్సరాల గ్రూపులో డబుల్స్ విన్నర్స్ : ఆనంద్ స్వరూప్ (హైదరాబాద్), నాళేకర్ (హైదరాబాద్); రన్నర్స్ : సేతు (సేలం), రాంబాబు (హైదరాబాద్); 45 సంవత్సరాల గ్రూపులో సింగిల్స్ విన్నర్ : సేతు (సేలం); రన్నర్ : దొర్జై (పూనె); డబుల్స్ విన్నర్స్ : సేతు (సేలం), ఎన్. గోపాలకృష్ణ (హైదరాబాద్); డబుల్స్ రన్నర్స్ : ఎ. రాంబాబు (హైదరాబాద్), పాండురంగయ్య (హైదరాబాద్); 55 సంవత్సరాల గ్రూపులో సింగిల్స్ విన్నర్ : రాజన్ (మైసూరు); రన్నర్ : కులకర్ణి (బెంగుళూరు); డబుల్స్ విన్నర్స్ : రాజన్ (మైసూరు), కులకర్ణి (బెంగుళూరు); డబుల్స్ రన్నర్స్ : డా॥ పి.వి. రావు (హైదరాబాద్), కరుణాకర్ (హైదరాబాద్); 65 సంవత్సరాల గ్రూపులో సింగిల్స్ విన్నర్ : ముత్తు కుమారస్వామి (తమిళనాడు); రన్నర్ : చంద్రనాథ్ (దవణగిరి); డబుల్స్ విన్నర్స్ : సి.బి. రాజు (పూలపల్లి), శైలేష్ రెడ్డి (హైదరాబాద్); డబుల్స్ రన్నర్స్ : చంద్రనాథ్ (కర్ణాటక), సహీమ్ (హైదరాబాద్)



ఓం నమో భగవతే శ్రీరమణాయ



# రమణ భాస్కర

సంపుటి : 6 సంచిక : 7 పుష్పం : 20- 20-3-2001

**RAMANA BHASKARA**
**TELUGU SPIRITUAL FORTNIGHT MAGAZINE**
PAGES : 16

**VOL: 6** **ISSUE: 7**

EDITOR
**P. S. RAMA RAJU**
EDITING
**P.H.V. SATYAVATHI (HYMA)**

**SUBSCRIPTION**
YEARLY : **Rs. 140/-**
Each Copy : **Rs. 10/-**

ADDRESS
**RAMANA BHASKARA**
SRI RAMANAKSHETRAM
JINNURU - 534 265
W.G.Dt., A.P.

**PUBLISHER**
P.S.RAMARAJU
LAKSHMI MODERN RICE MILL
ULLAMPARRU - PALAKOL
☎ 08814 - 24589, 24689

**PRINTER**
SHRIRAM GRAPHICS
BANK STREET - PALAKOL
☎ 08814 - 22438, 24278

## సాంఘిక సేవ

ఆత్మజ్ఞానం లేకపోవటం అవిద్య. అట్టి అవిద్య అజ్ఞానముతో కూడుకొన్నది. దాని నుంచి ఉద్భవించిన మనస్సు, మనిషికి ఒక సమస్యగా తయారయింది. అజ్ఞానంలో ఉన్న మనస్సు వాస్తవాలను పట్టించుకోకుండా, ఇతరులతో స్వార్థపూరితమైన సంబంధం పెట్టుకొంటుంది. ఒకరిని ఒకరు తమ స్వార్థప్రయోజనాలకు వాడుకోవటమే ప్రస్తుతం మనకు ఇతరులతో ఉన్న సంబంధం. అట్టి సంబంధం ఎల్లప్పడూ సంఘర్షణకు దారితీస్తుంది. జీవితం అంటే ఇతరులతో ఉన్న సంబంధం కనుక, ఇట్టి స్వార్థపూరితమైన సంబంధాల వల్ల జీవితం అస్తవ్యస్తంగా ఉండి అతలాకుతలమౌతుంది.

అందుచేత మానవ మనస్సు సంస్కరింపబడాలి. ఇతరులతో మనకున్న సంబంధమే సమాజము. మనస్సు సంస్కరింపబడనంత కాలం, మనిషి జీవితంలాగే సమాజం కూడా అస్తవ్యస్తంగా ఉంటుంది. దైనందిన జీవితంలో ఇది మనకు తెలుస్తూనే ఉంటుంది. అందుచేత మనస్సు సంస్కరించుకోవటం ప్రతీమనిషి చెయ్యవలసిన మొదటిపని. మనస్సు సంస్కరించుకోవటానికి మనకు ఇతరులతో ఉన్న సంబంధం అనే దర్పణం ఎంతో ఉపయోగపడుతుంది. అందుచేత ఇతరులతో ఉన్న సంబంధం నుంచి పారిపోకుండా, వారితో ఉన్న సంబంధం అనే దర్పణంలో మన యదార్థస్థితిని గ్రహించి, మనను మనం సంస్కరించుకోవాలి. ఇట్టి ప్రక్రియలో సత్యదర్శనం కలుగుతుంది. ఇట్టి జిజ్ఞాస వల్ల నిశ్చల మనస్సు సిద్ధించి, మనస్సు ప్రేమతో నిండుతుంది. ప్రేమతో నిండిన మనస్సుకు ఇతరులతో సరైన సంబంధం ఏర్పడి, దానికి సమస్యలు ఉండవు. మన మనస్సు సంస్కరింపబడినప్పడు, ఆప్రభావం సమాజం మీద పడుతుంది. ఆత్మజ్ఞానంకలవారు మౌనంద్వారా సమాజమును, దానిలో ఉన్న వ్యక్తులను సంస్కరింపగలరు. ఇదే నిజమైన సాంఘిక సేవ. మిగతా సేవలన్నీ తాత్కాలికములే.

.... ఎడిటర్

**ఈ సంచికలో............**

సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహ భాషణములు

13-02-2001 సఖినేటిపల్లి ........ 2
07-12-2000 కాపవరం ........ 5
05-03-2001 గుమ్మలూరు ........ 8

# కారణభక్తి వలన కోరికలు తీరతాయి - అకారణభక్తి వలన మోక్షం సిద్ధిస్తుంది

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 13-2-2001, సఖినేటిపల్లి

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

విద్యలలో ఆత్మవిద్యను నేను అని భగవంతుడు చెప్పాడు. మనకు నేను అంటే దేహం స్ఫురిస్తోంది. నేను అంటే నీకు హృదయంలో ఉన్న బ్రహ్మం స్ఫురించాలి. అప్పటివరకు నీవు సాధనచేస్తూ ఉండవలసిందే. దేహానికి అనారోగ్యంవస్తే దానిని తొలగించుకోవటానికి ప్రయత్నం చేస్తాముఅలాగే మన మనస్సులో ఉన్న బలహీనతలను తొలగించుకోవటానికి ప్రయత్నం చేయాలి. నీకు బ్రహ్మానుభవం కలుగకుండా నీ మనస్సులో ఉన్న బలహీనతలే అడ్డువస్తాయి. మనస్సులో ఉన్న బలహీనతలను తొలగించుకోవటానికి ప్రయత్నంచేస్తూ ఉంటే గురువు యొక్క అనుగ్రహం నీకు సహకరిస్తుంది. గురువు యొక్క మాటకంటే, బోధకంటే గురువు యొక్క కరుణ గొప్పది. ఇంటిలో పనులు ఎక్కువగా ఉన్నాయి. ధ్యానం చేయటానికి, జపం చేయటానికి టైము ఉండటం లేదు, నేను శాస్త్రాలు చదువుకోలేదు అంటున్నాడు. శాస్త్రాలు చదువుకోపోవచ్చు. పాండిత్యంతో దీనికి సంబంధం లేదు. నీవు ఆత్మవై ఉన్నావు. పాండిత్యం వలనగాని, ధనం వలన గాని, యశస్సువలనగాని, సంతానం వలనగాని లోపల ఉన్న వస్తువు తెలియబడదు. ఆ వస్తువు ఎవరికైతే తెలియబడాలి అని అనుకొందో వారికి మాత్రమే అది తెలియబడుతుంది. శాస్త్రములో వెతికితే పాండిత్యం వస్తుంది, హృదయంలో వెతికితే వస్తువు దొరుకుతుంది. ఆత్మజ్ఞానం పొందటానికి ఇంట్లో పనులు అడ్డువస్తున్నాయి, ఎవరో అడ్డువస్తున్నారు అనుకొంటున్నారు ఎవరూ నీకు అడ్డురావటంలేదు. నీకు నీవే అడ్డువస్తున్నావు.

మనస్సు లోపలకు వెళితే చైతన్యం. మనస్సు బాహ్యానికి వస్తే అహంకారం. లోపలకు వెళితే ఆనందం, బయటకు వస్తే దుఃఖం. అది ఎటు ప్రయాణం చేస్తోందో చూసుకో. దోషం అంతా అహంకారంలోనే ఇమిడిఉంది అని మనకు తెలియటం లేదు. దోషం ఎక్కడో ఉంది అనుకొంటున్నాము. అహంకారంలోనే దోషం ఉంది అని మనం గుర్తించాలి. దానికి పరిశీలన అవసరం. దేహప్రారబ్ధంలో ఏమిఉంటే అదేవస్తుంది. భగవంతుని మీద అకారణభక్తి ఉండాలి. ఏదైనా కారణంకోసం భగవంతుని ప్రార్థిస్తే అదిపోయిన తరువాత భగవంతుడిని మర్చిపోవచ్చు. అందువలన కారణభక్తి పనికిరాదు. భగవంతుడిని భగవంతుడి కోసమే ప్రేమించాలి. పని అవ్వకముందు దేవుని దయవలన ఈ పనిఅయిపోతే బాగుండును అనుకొంటాము. పని అయిపోయిన తరువాత నా తెలివివలన, నా సమర్థతవలన అయిపోయింది అనుకొంటాము. మానవుడిలో సహజంగా కృతజ్ఞతాభావం తక్కువగా ఉంటుంది. నీలో ఎంత కృతజ్ఞత ఉందో లోపల ఉన్న ఈశ్వరుడు చూస్తూ ఉంటాడు. కారణభక్తి కూడా భక్తేకాని అది నిలబడదు. భగవంతుడి మీద సహజంగా ప్రేమ ఉంటే అది అకారణభక్తి. నిజమైన భక్తుడు మోక్షాన్ని కూడా కోరుకోడు. మనకు అర్హత ఉంటే కోరుకోకపోయినా వస్తుంది. మనకు అర్హత లేకపోతే కోరినా అది ఇవ్వడు. అందువలన మనం అర్హతను సంపాదించాలి. అకారణభక్తి జ్ఞానానికి దారితీస్తుంది.

మనస్సును నిగ్రహించుకోవటానికే పూజ, జపం, ధ్యానం. మనస్సుకు నిగ్రహం వస్తేగాని దానికి లోచూపు కలుగదు. దానికి లోచూపు కలిగితేనేగాని, ఆత్మానుభవం కలుగదు. పలాన తలంపు రాకూడదు అని అనుకొంటాము. సరిగ్గా అదే వస్తుంది. రాకూడదు అని అనుకోవద్దు. వాటిని రానివ్వండి, వాటితో వెళ్ళకండి, వాటితో తాదాప్యం పొందకండి, వాటిని పట్టించుకోవద్దు అవే వెళ్ళిపోతాయి. రోడ్డుమీద మంచివారు వెళుతూ ఉంటారు, చెడ్డవారు వెళుతూ ఉంటారు వారిని పట్టించుకోము. రోడ్డు మీద జనంకూడా మనం వెళ్ళిపోతున్నామా వెళ్ళటంలేదు. అలాగే తలంపులకూడా వెళ్ళవద్దు. మంచి తలంపులు వస్తూ ఉంటాయి, చెడుతలంపులు వస్తూ ఉంటాయి. వాటిని పట్టించుకోవద్దు. మనం ఒక దుర్మార్గునితో సహవాసం చేస్తున్నాము అనుకోండి ఎంతో కొంతమనలో దుర్మార్గం ఉంటేనేగాని వారితో సహవాసం చేయాలనే బుద్ధి కలుగదు. మీకు వచ్చే తలంపును రిపీటెడ్‌గా యాక్షన్‌లో పెడితే అది బలీయమైన వాసనగా మారిపోతుంది. ఒకో తలంపు మీకు సంతోషాన్ని తీసుకొని వస్తుంది. ఒకో తలంపు మీకు దుఃఖాన్ని తీసుకొనివస్తుంది. సంతోషం తీసుకొని వచ్చే తలంపులు రావాలి, దుఃఖం తీసుకొనే తలంపులు రాకూడదు అని అనుకోవద్దు. ఆ తలంపులను రానివ్వండి. వాటితో తాదాప్యం పొందకండి, వాటిని యాక్షన్‌లో పెట్టకండి. తలంపులు వస్తూ ఉంటాయి, వెళ్ళిపోతూ ఉంటాయి. తరువాత పల్చబడి రాలిపోతాయి, పునర్జన్మ హేతువులు అవ్వవు. అలా ప్రయత్నం చేస్తూ ఉంటే గురువు అనుగ్రహం వలన దుఃఖంలేని స్థితికి ఎదిగివెళ్ళ పోతారు.

ఆత్మానుభవం కలగటంకోసం మనకు ఏదో ఒక్క దేవతానుగ్రహం చాలు. నీకు ఏది నిజమో తెలియకపోయినా, నీవు ఉపాసించేదేవతకు ఏది నిజమో తెలుసు కాబట్టి ఆ నిజం దగ్గరకు తీసుకొని వెళుతుంది అయితే నీవు ఏదేవతను ఆరాధిస్తున్నావో ఆదేవత మీద నీకు ప్రేమభావన ఉండాలి, ఉదాత్తమైన భావన ఉండాలి, మిక్కిలి గౌరవం ఉండాలి లేకపోతే ఆదేవత మీద నీ మనస్సు నిలబడదు. నీవు భక్తితో, ప్రేమతో ఆరాధించటం వలన ఆదేవత మీద నీ తలంపు బలపడుతుంది. ఆతలంపు ఇతర తలంపులను తగ్గించేస్తుంది. దేవతను పూజించటం, ఆరాధించటం ఇది కూడా ఒక తలంపే. మిగిలిన తలంపులు పోయిన తరువాత ఈ తలంపు కూడా పోతుంది. అప్పుడు నీ హృదయంలో ఉన్న నారాయణుడే నీకు స్వరూపంగా వ్యక్తమవుతాడు. మిమ్మల్ని అనుగ్రహించే శక్తి, ప్రేమించేశక్తి, సహజస్థితిలో నిలబెట్టే శక్తి ఒక్క చైతన్యానికే ఉంది. సత్వగుణాన్ని అభ్యాసం చేస్తూ ఉంటే ధ్యానం దానంతట అదే వస్తుంది. ధ్యానం జ్ఞానానికి దారితీస్తుంది. ఎప్పుడైతే ధ్యానం జ్ఞానానికి దారితీసిందో అప్పుడునీకు సహజస్థితి కలుగుతుంది. ప్రయత్నం ఉన్నచోట బంధం ఉంటుంది. ధ్యానం సహజంగా రాదు అనుకోండి. మనం బలవంతంగా చేస్తూ ఉంటే అది ఎప్పుడు అయిపోతుందా, ఎప్పుడు అయిపోతుందా అనుకొంటాము. ఎందుచేతనంటే అక్కడ మీకు తెలియని బంధం, మీకు తెలియని బాధ ఉంది. మీరు ఏ దేవతను ఆరాధిస్తున్నారో ఆ దేవత మీద ప్రేమ ఉండాలి, ప్రేమ లేకుండా ధ్యానం చేస్తూ ఉంటే అది యాంత్రికంగా ఉంటుంది. ఏమీ ఆశించకుండా మనం ఈ సృష్టిని సహజంగా ప్రేమించినా దేహబుద్ధి నశిస్తుంది, అజ్ఞానం నశిస్తుంది. కొందరికి అదాన దోషం ఉంటుంది. అదానదోషం అంటే వారికి అన్నీ ఉంటాయి ఎవరికీ ఏదీ ఇవ్వరు. పాడైపోతే పెంటమీద పోస్తారుగాని

ఎవరికీ ఏదీ ఇవ్వరు. లోభిత్వం ఉన్నవారు ఎవరైనా షిరిడీ బాబా దగ్గరకు వస్తే డబ్బు ఇవ్వమని ప్రత్యేకంగా వారిని అడిగితీసుకొని ఎవరైతే ఇబ్బంది పడుతున్నారో వారికి ఇచ్చేవారట. అంటే ఆరోగం పోగొట్టటానికి గురువు చేసే పని అది.

జపం చేసి, జపం చేసి జపంచేసి జపి నశించాలి. జపం చేసే జపినశిస్తే నీకు సహజస్థితి కలుగుతుంది. ఒకవేళ జపంచేసే జపి నశించకపోయినా నీకు పుణ్యం కలుగుతుంది. జపం చేయటం వలన మనస్సులో ఉన్న చింతలు పోతాయి, అలవాట్ల యొక్క వేగం తగ్గుతుంది. సాధనచెయ్యి, సాధనచెయ్యి. అందులో ఏమీలేదు అని తెలిసేవరకూ సాధన చెయ్యిఅంటారు భగవాన్. ప్రయత్నం చెయ్యి, ప్రయత్నం చెయ్యి నేను ప్రయత్నం చేస్తున్నాను అనే తలంపు పోయేవరకు ప్రయత్నం చెయ్యి అప్పుడు నీకు సహజస్థితి కలుగుతుంది. హృదయంలో ఉన్న వస్తువు అనుభవంలోనికి వచ్చేవరకు ఎంతోకొంత విశ్వాసం మీద ఆధారపడాలి. వస్తువు అనుభవంలోనికి వచ్చాక నమ్మకాలతోటి, విశ్వాసాలతోటి పనిలేదు. మన దగ్గర నాలుగు మామిడి పండ్లు ఉన్నాయి అనుకోండి. ఎవరికైనా ఒక మామిడి పండు ఇవ్వాలి అని మీకు అనిపిస్తే అందులో ఏది చెడ్డదో చూస్తాము అది వారికి ఇస్తాము, మిగిలిన మూడు పండ్లు మనం ఉంచుకొంటాము. ఇటువంటి పాడుబుద్ధికి జ్ఞానమా అంటున్నాడు భగవంతుడు. మీరు ఎవరినీ విమర్శించవద్దు. మిమ్మల్ని ఎవరైనా విమర్శిస్తూ ఉంటే జాగ్రత్తగా వినండి, ఉద్రేకపడవద్దు. ఒకవేళ ఆ విమర్శకు సంబంధించిన దోషం నీలో ఉంటే దానిని తొలగించుకోవటానికి ప్రయత్నం చేయండి. ఆ విమర్శకు సంబంధించిన దోషం నీలో లేకపోతే నిర్మలంగా ఉండండి, వారిమీద రియాక్టు అవ్వవద్దు. సాధన అంటే ఇది. మనం ఇతరులను విమర్శిస్తే మన మనస్సు పొల్యూట్ అయిపోతుంది. మనం పనిచేసేటప్పుడు మన సహజస్థితి పోతుందేమో అని అనుకొంటారు, నీ అహంకారం అలా అనిపింపచేస్తుంది. పని ఇంద్రియాలు చేస్తాయి. పనిచేసినప్పుడు, చేయనప్పుడు అన్ని అవస్థలలోనూ నీవు ఆత్మవే. దానికి నీవుచేసే పనికి ఏమీ సంబంధం లేదు. పనిచేయటం వలన నీవు టైర్ అవ్వవు. ఆపని నేను చేస్తున్నాను అనే తలంపు వలన టైర్ అవుతున్నావు. భగవాన్ చెప్పిన ఈ మాట ఒక ఉపనిషత్. ఏమాట అయితే చైతన్యం దగ్గరకు తీసుకొని వెళుతుందో అది ఉపనిషత్. మొక్కను నాటి దానికి నీరుపోస్తారు. దానివలన మొక్కకు శక్తి వచ్చి అది ఎదుగుతుంది. నీరు పోయకపోతే అది ఎండిపోతుంది. అలాగే గురువుని ధ్యానం చేయటంవలన, స్మరించటం వలన ఆస్మరణలోనుండి, ధ్యానంలోనుండి మనకు శక్తి వస్తుంది. దేహయాత్రలో ఏవైనా ఆటుపోటులు వచ్చినా వాటిని తట్టుకొనే శక్తి పూజవలన, జపంవలన, ధ్యానం వలన నీకు కలుగుతుంది. నీవు ఏరకంగా పనిచేస్తే నీవు బ్రహ్మంలో ఐక్యం అవ్వటానికి ఆపని నీకు సహాయసహకారములు అందిస్తుందో ఆ రకంగా పనిచెయ్యి, అదే యోగం. కుమారస్వామి దర్శనప్రియుడు అని చెపుతారు. ఎన్నో జన్మలు సాధనచేసి, సాధనచేసి మనం సంపాదించలేనిది ఒక్క దర్శనం మాత్రంచేతనే ఆ అంతస్థులో కూర్చోపెడతాడు వాడు కుమారస్వామి. మనం జీవితం పొడుగునా కృతజ్ఞత చూపించినా వాడి ఋణం మనం తీర్చుకోలేము.

## సత్వగుణ ప్రభావంలో ఉన్నవాడిద్వారా కర్తృత్వంలేని పని జరుగుతుంది

### సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 7-12-2001, కాపవరం

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

ఈ రోజు గీతా జయంతి. అంటే ఈ రోజు కృష్ణుడు యుద్ధభూమిలో భగవద్గీతను అర్జునునికి బోధించాడు. వేదాలలో ఉన్న సారాన్ని, ఉపనిషత్‌లలో ఉన్న సారాన్ని భగవద్గీతగా చెప్పాడు. ఈ భగవద్గీతను అర్థంచేసుకొని, ఆచరించి, దానిని అనుభవంలోనికి తెచ్చుకొని ఇతరులకు అర్థమయ్యేలా ఎవరైతే బోధిస్తున్నారో వారు నాకు అత్యంత ప్రీతిపాత్రులు, వారికి నా స్వరూపం ఇస్తాను అని భగవంతుడు చెప్పాడు. శాస్త్రం చెప్పేటప్పుడు శ్రద్ధగావినేవారి దగ్గర చెప్పాలిగాని హేళన చేసేవారి దగ్గర చెప్పకూడదు. మనం ముందు భగవద్గీతలో 12వ అధ్యాయం పట్టుకోవాలి. ముందు భక్తి ఉండాలి తరువాత జ్ఞానం. ఇంటి దగ్గర ఏదైనా పనిచేయాలన్నా ముందు భక్తిఉండాలి, శ్రద్ధ ఉండాలి. శ్రద్ధలేకపోతే జ్ఞానం కలుగదు. ఏపని అయినా శ్రద్ధతో చేస్తే, భక్తితో చేస్తే చాలా సక్రమంగా ఉంటుంది. భగవద్గీతలో పని గురించి ఎక్కువ చెప్పాడు. స్వార్థం పెట్టుకొని మనం పనిచేస్తే అది భౌతికానికే పరిమితం, లోకానికే పరిమితం. స్వార్థం పెట్టుకొని మనం పని చేస్తే ఫలితం రావచ్చు అది ఈ భూమి మీద ఎంజాయ్ చేయవచ్చు. ఈ దేహం ఎంత నిజమో, లోకం ఎంత నిజమో మనం అనుభవించేది కూడా అంతే నిజం. ఇటువంటి కర్మద్వారా మోక్షం రాదు, ఉత్తమ స్థితిని పొందలేవు. అకర్మద్వారా నీవు మోక్షాన్ని పొందు. అకర్మ అంటే కర్తలేని కర్మ. కర్తృత్వంతో నీవు చేసేది కర్మ. కర్తృత్వంతో పనిచేస్తే మంచికి మంచి, చెడుకు చెడు నిన్ను చుట్టుకొంటుంది. కర్తృత్వం లేని కర్మను చేస్తే అది నిన్ను బంధించదుసరికదా నిన్ను మోక్షం దగ్గరకు తీసుకొని వెళుతుంది. అందువలన అకర్మను ప్రాక్టీసు చెయ్యి.

మనకు సత్వగుణం, రజోగుణం, తమోగుణం అని మూడు గుణాలు ఉంటాయి. సత్వగుణం ఉన్నవాడికి యాక్షన్ ఉంటుందిగాని, రియాక్షన్ ఉండదు. పనినివాడు డ్యూటీగా చేస్తాడు, అశ్రద్ధ చేయడు. ఫలం వస్తే సంతోషించడు, ఫలంరాకపోతే వ్యాకులత చెందడు. వాడిపని ఏదో వాడు చేసుకొని పోతాడు, చప్పుడు ఉండదు. రజోగుణంలో ఉన్నవాడు కలిసివస్తే పనిచేస్తాడు, కలిసిరాకపోతే పనిచేయడు, మాట్లాడడు. కేవలము భౌతిక దృష్టితో పని చేస్తాడు తప్ప భగవంతుడి దృష్టివాడికి ఉండదు. తమోగుణంలో ఉన్నవాడికి తిండి, నిద్ర తప్ప పనిగొడవ వాడికి ఉండదు. అనేక జన్మల్లోకృషి చేస్తేగాని మీకు మోక్షంరాదు అని భగవంతుడు చెప్పాడు. మోక్షంమాట అటుంచండి అనేక జన్మల కృషివలన గాని మనకు సత్వగుణంరాదు. సత్వగుణం లేకుండా మోక్షంరాదు. రజోగుణంలో ఉన్నవాడికి శరీరం ఒకచోట, మనస్సు ఒకచోట ఉంటాయి. మనస్సు యొక్క చాపల్యానికి రజోగుణం కారణం. రజోగుణం యొక్క విజృంభణ ఆపుచేయాలి. అది కూడా సాధనలో ఒక భాగము. సత్వగుణం ఉన్నవాడికి శరీరం ఎక్కడ ఉందో మనస్సు అక్కడే ఉంటుంది. సత్వగుణం ఉన్నవాడు దేవుని

దగ్గరకు వెళ్ళినా నీ అనుగ్రహమేచాలు, నీ ప్రేమేచాలు అంటాడు. రజోగుణం ఉన్నవాడు దేవుని ఏదో ఒకటి అడుగుతాడు, దేవుడితో వ్యాపారం చేస్తాడు. నీ మనస్సు నిర్మలంగా ఉంది అనుకో, నిశ్చలంగా ఉంది అనుకో, ఇతరులకు జ్ఞానం కలుగజేయటానికి నీ వాక్కు సహకరిస్తోంది అనుకో అదికూడా తపస్సు. కృష్ణుడు యుద్ధభూమిలో భగవద్గీత బోధించాడు. అర్జునుడు త్రాగినన్ని పాలుత్రాగాడు. మనకు కూడా పాలు విడిచిపెట్టాడు. మనంకూడా త్రాగవచ్చు. మన తరువాత తరంవారుకూడా త్రాగవచ్చు, తరించవచ్చు. అది జ్ఞానక్షీరము. జ్ఞానక్షీరము కొంచం నోటిలో పోసుకొంటేచాలు మనకు అమృతస్థితి కలుగుతుంది. అంటే భగవద్గీతలో చెప్పినట్లు జీవించటం ప్రాక్టీసుచేస్తే మనకు అమృతానుభవం కలుగుతుంది.

కొంతమంది గుడికి వెళ్ళటానికి కూడావారు ఏమనుకొంటారు, వీరు ఏమనుకొంటారు అని భయపడతారు. క్షుద్రం హృదయ దౌర్బల్యం అన్నాడు కృష్ణుడు. అన్నింటికంటే అత్యంత నీచమైనది భయం, భయం వలన దుఃఖం వస్తుంది. అందువలననే అభయస్థితిని పొందమని భగవంతుడు చెపుతున్నాడు. అభయస్థితి ఎక్కడ ఉంది అంటే ఆత్మలోనే ఉంది. అభయస్థితి వచ్చేవరకూ జనన మరణప్రవాహం నిన్ను విడిచిపెట్టదు. భయపడేవాడికి సబ్జక్టుకూడా అర్థంకాదు. భయపడటం వలన శారీరక అనారోగ్యం, మానసిక అనారోగ్యం కలుగుతుంది. మీ మనస్సు అస్తమానూ ఎవరిమీద వాలుతోందో వారిమీద నీకు ఎటాచ్‌మెంట్ ఉన్నట్లు గుర్తు అంటే బంధం ఉన్నట్లు. నీవు చేసేపని వలన నీకు బంధం పెరగకూడదు, బంధం నుండి విడుదల పొందటానికి నీవు చేసేపని సహకరించాలి. నిజమైన బంగారం నీ హృదయంలోనే ఉంది. దేహభావన వలన ఆ బంగారం నీకు తెలియటం లేదు. ఈ దేహం ఉంటే ఉంటుంది, చనిపోతే చనిపోతుంది. అది నువ్వు కాదు కదా దాని గోల నీకెందుకు అంటారు భగవాన్. ఒక్క ఆత్మగురించి తప్ప మీరు ఏది మాట్లాడినా ఆమాటలు మిమ్మల్ని ఎవరు మాట్లాడమన్నారు అంటారు, అక్కడ ఆయన రాజీపడరు. మాటలో కల్మషం ఉండకూడదు. కొంతమంది మనసులో ఉన్నది నోటితో చెప్పరు, చెప్పింది మనసులో ఉండదు. అది కల్మషానికి గుర్తు. ఇది అంతా రజోగుణ ప్రభావము. రజోగుణం ఉన్నప్పడు ఆలోచనకు, మాటకు, చేతకు సమన్వయం ఉండదు. సుఖం, శాంతి నీ హృదయంలోనే ఉన్నా కల్మషం ఉన్నప్పడు అవి నీ చేతికి అందవు. నీ శరీరం కంటే, నీ ఇంద్రియాలకంటే అత్యంత సమీపంలో నీ హృదయంలోనే మోక్షం ఉన్నప్పటికీ అది నీకు అందటం లేదు దానికి నీ దేహాభిమానం కారణం. ఈ దేహాభిమానం ఒక్క రోజులో పోదు. దానిని తగ్గించుకోవటానికి రోజూ ప్రాక్టీసు చేయాలి. నీవు మాట్లాడేమాట, నీచేత, నీ వ్యవహారశైలి దేహాభిమానం తగ్గేటట్లు ఉండాలి.

ఈ లోకంలో ఏమీలేదు అని అర్థమవుతోంది, ఇంక పునర్జన్మవద్దు, ఈ జన్మలోనే మోక్షం కావాలి కనుక నన్ను అనుగ్రహించి మోక్షాన్ని ప్రసాదించండి అని ఒకరు భగవాన్‌ను అడుగుతున్నారు. నీ స్వరూపమే మోక్షం. మోక్ష శబ్దానికి విడుదల అని అర్థం. దేని నుండి విడుదల? మనం కానిదానిని మనం అనుకొంటున్నాము. అలా అనుకోవటం వదిలేస్తే

లోపల ఉన్న మోక్షం నీకు అర్ధమవుతుంది. నాకు ఇష్టమైన పని చెయ్యి. ఏపని చేస్తే నా అనుగ్రహం నీకు కలుగుతుందో ఆపనిచెయ్యి. నాకు ఇష్టమైన పనిచెయ్యటమే కాదు నువ్వు పొందవలసిందికూడా నన్నే అని భగవంతుడు చెపుతున్నాడు. మనం పూజలు చేస్తాము, జపాలు చేస్తాముకాని భగవంతుడిని పొందటం గమ్యంగా పెట్టుకోము. మనకు ఉన్న కోరికలు నెరవేరటం ముఖ్యంగా పెట్టుకొంటాము. ఇక్కడే మిస్‌అయిపోతున్నాము. మన గమ్యాన్ని మర్చిపోతున్నాము. మీ చిల్లరి కోరికలు అడగవద్దు. మీ యోగక్షేమాలు నాకు తెలుసుకదా, మీ భౌతిక అవసరాలు ఏమిటో నాకు తెలుసుకదా. మీరు జ్ఞాపకం చేయనక్కరలేదు. మీ మనస్సునిండా నన్నే పెట్టుకొని పనిచెయ్యండి. మీ గురించి మీకంటే నాకే ఎక్కువ తెలుసు, కాని నాకు ఏమీ తెలియదని మీరు అనుకొంటున్నారు అందరి హృదయాలలో అంతర్యామిగా ఉన్నానుకదా మీ గురించి తెలియకుండా ఉంటానా అని భగవంతుడు చెపుతున్నాడు. ఈశ్వరుడు అడిగినవారికి అడిగినదే ఇస్తాడు. అడగనివారికి అన్నీ ఇచ్చి మోక్షం కూడా ఇస్తాడు అని భగవాన్ అక్షరమణమాలలో చెప్పారు. గురువుమీద భక్తివలన కూడా మోక్షం వస్తుంది. ఉపయోగమైన మాటలు బ్రెయిన్‌లో పెట్టుకోవాలి. మీ మనస్సును, ఇంద్రియాలను నియమించుకోండి. మిమ్మల్ని మీరు స్వాధీనం చేసుకోవటానికి ప్రయత్నం చేయండి. మానసిక ఆరోగ్యం, శారీరక ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకోండి. తిండి విషయంలో జాగ్రత్తగా ఉండండి. మీ దేహం నిలబడటానికి ఎంతవరకు అవసరమో అంతవరకే తినాలి. అతిగా తినటం వలన నిద్రవస్తుంది, ఆలోచన తగ్గుతుంది, తమోగుణం వస్తుంది. అందువలన ఆహారం విషయంలో బహుజాగ్రత్తగా ఉండాలి.

**సాధ్యమైనంత వరకు మన మనోదేహములను సక్రమంగా ఉపయోగించుకొని, సామాజిక స్పృహ కలిగి ఉంటే పవిత్రులమవుతాము. పవిత్రుడు ఈశ్వరుని కృపకు పాత్రుడవుతాడు.**

## లోకాన్ని ఏదో ఉద్ధరించాలి అనుకోవద్దు. లోకంలో ఉండి నువ్వు బాగుపడేవిధానం చూసుకొని బయటకు వెళ్ళిపో

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 5-3-2001, గుమ్మలూరు

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

మనం ఆత్మే, మనం సత్యవస్తువే, మనం బ్రహ్మమే కాని అది మనం అన్నసంగతి మనకు తెలియటం లేదు. మనం ఎవరో మనకు తెలియకపోవటమే అజ్ఞానం. అందులోనుండి అహంకారం వస్తుంది. అహంకారంలో నుండి ఇతరతలంపులు వస్తున్నాయి. దానినిబట్టి పునర్జన్మలు వస్తాయి. అయితే మనం మంచి వారితో స్నేహంచేస్తే మంచితలంపులు రావచ్చు, చెడ్డవారితో స్నేహంచేస్తే చెడు తలంపులు రావచ్చును. మూలతలంపు, ప్రధమ తలంపు మటుకు ప్రతీజన్మలోనూ మనకూడా వచ్చేస్తుంది. కొంతమందికి అదృష్టవశాత్తు మంచి స్నేహాలు దొరుకుతాయి. పూర్వపుణ్యంలేకపోతే, పూర్వజన్మలో సత్కర్మచేసి ఉండకపోతే మంచి స్నేహాలు దొరకవు. సత్కర్మ అంటే ఇతరులకు క్షేమం కలుగజేసేపని, ఇతరులకు ఉపకారం చేసేపని. సత్కర్మ ఎందుకు చేయమన్నారు అంటే గొప్పలకోసం కాదు, సత్కర్మ మన హృదయంలో ఉన్న సత్యవస్తువును తెలుసుకోవటానికి సహకరిస్తుంది. మనం మాట్లాడే మాటను బట్టి, మనంచేసే పనులను బట్టి, మనకు వచ్చే ఆలోచనలనుబట్టి, మనం తినే ఆహారాన్నిబట్టి మన స్వభావం ఏర్పడుతుంది. సాధనచేయగా చేయగా మనం చేసేసాధనే మన స్వభావంగా అయిపోతుంది. సాధన చేసేటప్పడు అది కష్టంగా ఉంటుంది, అది స్వభావం అయిపోయాక ఇంక కష్టం ఉండదు. ఏపని అయినా నేర్చుకొనేటప్పడు కష్టంగా ఉంటుంది. అలవాటు అయ్యాక కష్టం ఉండదు. ప్రతీజన్మకు మన తల్లితండ్రులు మారతారు, పరిసరాలు మారతాయి, బంధువులు మారతారు, తలంపులు మారతాయి, శరీరాలు మారతాయి అన్నీ మారతాయిగాని దేహం నేను అనే మొదటి తలంపు మాత్రం మారదు, అది ప్రతీజన్మలోను కూడా వచ్చేస్తుంది. అదే బంధం, పుట్టలో పాము ఉంది అనుకోండి. పుట్టమీద ఎన్ని దెబ్బలు కొట్టినా పాము చావదు, పాము మీద దెబ్బలుకొడితే పాము చనిపోతుంది. అలాగే మూలతలంపును వదిలేసి ఎన్ని ప్రయత్నాలు చేసినా దానివలన ప్రయోజనం ఏమీ ఉండదు. పుణ్యం వస్తే రావచ్చును అది అనుభవిస్తే పోతుంది. భగవాన్ ఏమి చెపుతున్నారు అంటే మూలతలంపును మినహాయించటం వలన ప్రయోజనం ఉండదు, నీవు చేసేసాధనలో మూలతలంపును ఇమడ్చాలి. అలా ఇమడ్చటం వలన అది నశించటం ప్రారంభిస్తుంది. మనం చేసే సాధన మూలతలంపుమీద గురిపెట్టాలి. అలా సాధనచేసినంత మాత్రాన మూలతలంపు పూర్తిగా నశించదు. మూలతలంపు పూర్తిగా వేరుతోసహా నశించాలంటే గురువు అనుగ్రహం ఉండాలి, పుణ్యబలం ఉండాలి. ఇవి అన్నీ కలిసివస్తేగాని అది పూర్తిగా నశించదు. దేహంనేను అనే తలంపు నీకు ఉంది అనుకో నువ్వు ఉన్నావు, నేను ఉన్నాను, మంచి ఉంది, చెడు ఉంది, పుణ్యం ఉంది, పాపం ఉంది, స్వర్గం ఉంది, నరకం ఉంది, జన్మలు ఉన్నాయి, బంధం ఉంది అన్నీ ఉన్నాయి. దేహం నేను అనే తలంపు ఉన్నంత కాలం అన్నీ ఉన్నాయి

అది లేనప్పుడు ఏదీలేదు, మిగిలేది నువ్వే. దేహం చనిపోయినప్పుడు దేహం బాధపడదు, దేహంతో తాదాత్మ్యం పొందే మూలతలంపు బాధపడుతుంది. దేహం మరణించాక ప్రయాణంచేసేది కూడా ఈ మూలతలంపే. ఈ మూలతలంపు తనకూడా ఇతర తలంపులను తీసుకొనిపోతుంది. ఎలా తీసుకొని పోతుందని భగవంతుడు చెప్పాడంటే ఇక్కడ మల్లెపూవుల చెట్టు ఉంది అనుకోండి. ఆ మల్లెపూవుల వాసనను గాలి ఎలా మోసుకొని పోతుందో అలాగే మూలతలంపు మిగతా తలంపులను మోసుకొని పోతుంది. అందులో మంచితలంపులు ఉండవచ్చు, చెడుతలంపులు ఉండవచ్చు.

మూలతలంపును నాశనం చేసేప్రయత్నంలోనే నువ్వు ఉండాలి. దానిమీదే నీగురి అంతా ఉండాలి. మనం పుట్టదగ్గర నిలబడి ఉన్నాము అనుకోండి. పాము బయటకు వచ్చినా మనలను చూసి మరల లోపలకు వెళ్ళిపోతుంది. అలాగే నీవు మూలతలంపును వాచ్ చేస్తూ ఉంటే అది బయటకు వచ్చినా మరల లోపలకు వెళ్ళిపోతుంది. మూలతలంపును దానిమూలంలో ఎక్కువసేపు ఉంచగలిగితే అది పల్లబడిరాలిపోతుంది. హృదయంలో మనస్సును నిలబెట్టి ఉంచగలిగితే అన్ని యోగాలు చేసినట్లే అన్నారు భగవాన్. మనస్సు హృదయాన్ని విడిచిపెట్టి వచ్చినప్పుడు విషయచింతన, మనస్సు హృదయంలో ఉంది అనుకోండి విషయచింతన తగ్గిపోతుంది, విషయచింతన ఎప్పుడైతే తగ్గిపోయిందో పునర్జన్మ హేతువులు అన్నీ పల్లబడిపోతాయి. అందుచేత ఎంత ఎక్కువ సేపు మనస్సును హృదయంలో ఉంచగలిగితే అంతనీకు ఆధ్యాత్మిక బలం వస్తుంది, హృదయం యొక్కలోతులు పెరుగుతాయి, మనస్సులో నుండి వేరుపడటం అలవాటు అవుతుంది. అలాకొంతకాలం సాధనచేయగా చేయగా మనోమూలంలో మనస్సు నిలబడి ఉన్నప్పుడు కొంతకాలానికి అది నశిస్తుంది. మనస్సు నశిస్తే నువ్వు నశించవు. నువ్వు ఎవరో నీకు తెలియబడుతుంది. అది పరమస్థితి. ఆస్థితి నీవు పొందాక అసలు జన్మలే లేవన్న సంగతి నీకు తెలుస్తుంది. ఎందుచేతనంటే నీవు పొందిన వస్తువుకు జన్మలులేవు.

భగవంతుడు మనకంటే పెద్దవాడు, మనకంటేశక్తి వంతుడు, మనకంటే జ్ఞానవంతుడు, అంతటావ్యాపించి ఉన్నవాడు ఆయనే. ఆయన మీద భక్తి పెంచుకొని ఆయనను ప్రేమించగా ప్రేమించగా మిధ్యానేను పోతుంది అని కొంతమంది చెపుతారు అని ఒక భక్తుడు భగవాన్‌ను అడుగుతున్నాడు. భగవంతుడిని ఎలా ప్రేమించాలంటే మిధ్యానేను మనకు జ్ఞాపకం రాకూడదు. మన అహంకారానికి 90 పైసలు వాటా ఇచ్చి భగవంతుడికి పది పైసలు ఇస్తే అహంకారం పోదు. నూటికి నూరుపాళ్ళు దేవుడికి ఇచ్చి దేవుడిని మనం ప్రేమిస్తూ ఉంటే అసలు మిధ్యానేను మనకు గుర్తుకురాదు. మిధ్యానేను మనకు గుర్తుకురానప్పుడు దానికి ఎనర్జీ పోతుంది. దానిని డైరెక్ట్‌గా ఫేస్ చేయనక్కరలేదు, దానితో పేచీలు పెట్టుకోనక్కరలేదు. మిధ్యానేను జ్ఞాపకం రాకుండా ఉండేటట్లు దేవుడిని ప్రేమిస్తూ ఉంటే మిధ్యానేను దానంతట అదే రాలిపోతుంది. అద్వైతజ్ఞానం ఎలా ఉంటుంది అంటే వాడికి ఇతరులు ఉండరు. ఇతరులతో మాట్లాడేటప్పుడు తనతోతానే మాట్లాడుకొంటున్నాను అనుకొంటాడు. ఇతరులకు ఏదైనా చెప్పినా నాకు నేనే చెప్పకొంటున్నాను

అనుకొంటాడు. ఆ స్టేటు మీరు అనుభవిస్తే అది తెలుస్తుందిగాని ఊహిస్తే అది రాదు. అక్కడ ద్వైతానికి అవకాశం లేదు. జ్ఞానం ఎవరికి వస్తుందని చెపుతారంటే నీవు ప్రపంచంలో ఉండాలి, ప్రపంచంలేని స్థితిని పొందాలి. నీకు ప్రపంచం ఏ రూపంలో ఉంది మిధ్యానేను రూపంలో ఉంది. ఆ మిధ్యానేనును తొలగించావు అనుకో ప్రపంచంలేని స్థితికి నీవు వచ్చేస్తావు. ఆ మూలతలంపు ఉన్నంతకాలం నిన్ను నీవు నమ్మటానికి వీలులేదు. ఈవేళ నీవు మంచివాడుగా ఉండవచ్చు, రేపు చెడ్డవాడుగా ఉండవచ్చు అది ముఖ్యం కాదు. అసలు మూలతలంపును ఎంతవరకు తొలగించుకొంటున్నావు అనేది ముఖ్యం.

కొంతమంది చెపుతున్నారు ఈ మధ్యమాకు చెడు ఆలోచనలు వస్తున్నాయి, చెడ్డ బుద్ధి వస్తోంది, రాకూడదు అది తప్పు అని తెలుస్తోందిగాని చెడ్డబుద్ధి వచ్చేస్తోంది అంటున్నారు. దానికి కారణం లోపల ఉన్న సైతాను, మిధ్యానేను. మనకు కడుపునొప్పి వస్తోంది అనుకోండి. కడుపు నొప్పి రాకూడదు అని మనం అనుకొంటాం కాని ఆ కడుపునొప్పికి కారణం ఉన్నప్పడు రాకూడదు అని అనుకొన్నా అది వచ్చేస్తుంది. అలాగే మనకు చెడు తలంపులు రాకూడదు అని అనుకొన్నా లోపల సైతాను ఉన్నప్పడు అవి వచ్చేస్తాయి. అందుచేత ఆ సైతానును విడిచిపెట్టి నువ్వు సాధనచేయటంవలన ఏమీ ప్రయోజనంలేదు. ఇది రమణ ఉవాచ. ఏ జన్మకు ఆజన్మ ఈ సైతానును వదిలేసి నీవు సాధనలు చేస్తూ ఉంటే, అదే నీ పునర్జన్మకు కారణం అయినప్పడు నీవు సాధించేది ఏమీలేదు. దానిని అలాగే ఉంచుకొని నీవు మంచికర్మలు చేస్తావు అనుకో నీకు పుణ్యం వస్తుంది. అందులో అనుమానం లేదు. పుణ్యం సుఖరూపంలో ఖర్చు అవుతుంది. మూలతలంపు అలాగే ఉంటుంది. ఆమూలతలంపు నశిస్తేగాని నీకు నిర్వాణస్థితి కలుగదు. ఒకోసారి చేప నీటిలో పైకి ఎగురుతుంది, మరల లోపలకు పోతుంది, నీటిలో ఈదుతూ ఉంటుంది. ఇవి అన్నీ నీటిలోనే చేస్తుంది. అలాగే జ్ఞాని ఏపనిచేసినా బ్రహ్మమే. అక్కడ నేను అనే తలంపు లేదు కాబట్టి జ్ఞాని పనిచేసినా ఆపని వాడిని అంటదు, వాడికి దుఃఖం లేదు. నేను అనే తలంపు ఉన్నప్పడు వాడికి మంచికి మంచి, చెడుకు చెడు. ఆ తలంపు లేనప్పడు వాడికి అంతా బ్రహ్మమే. కృష్ణుడు అర్జునుడితో చెపుతాడు నువ్వు బ్రాహ్మీస్థితిని పొంది మూడులోకాలను నాశనం చేసినా నీకు పాపం అంటదు అని చెప్పాడు. నేను అనే తలంపు ఉన్నవాడికి పాపం. ఆతలంపు దాటినతరువాత వాడిని పాపం అంటదు. ఎందుచేతనంటే వాడు మనలాగ ద్వేషంతోను, అసూయతోను, పగతోను ఆపని చేయడు. వాడు చేసేపని బ్రహ్మంలో ఉండిచేస్తాడు. వాడు నడిచినా, కూర్చొన్నా ఏపనిచేసినా అంతా బ్రహ్మమే. బ్రహ్మముకంటే అన్యముగా వాడికి ఏమీ కనబడదు కాబట్టి వాడికి దుఃఖం లేదు. జ్ఞాని నిర్మలంగా ఉంటాడు, సమానంగా ఉంటాడు. సంతోషం, స్నేహం, దయ అనేవి జ్ఞాని నేర్చుకోడు అవి వాడికి సహజంగానే ఉంటాయి. మనకు సహజంగా లేకపోయినా నేర్చుకొంటే కొంతకాలానికి మనకు సహజమవుతాయి. లోకాన్ని ఏదో ఉద్ధరించాలి అనుకోవద్దు. లోకంలో ఉండి నువ్వు బాగుపడేవిధానం చూసుకొని బయటకు వెళ్ళిపో. ఏదైనా సేవచేస్తే చెయ్యి ఉద్ధరించటానికి నీవు ఎవడవు. ఈలోకం నీదీకాదు, నాదీకాదు


దేవుడిది. దుష్టమనస్సు ఉన్నవారిపట్ల జ్ఞానికి విరోధం ఉండదు. వారి ప్రవర్తనపట్ల ఓర్పు కలిగి ఉంటాడు. మనకు ఈ లక్షణాలు లేకపోయినా వాటిని అభ్యాసం చేయటం వలన అభ్యాసం మన స్వభావం అయిపోతుంది. అందులోనుండి జ్ఞానం సంపాదించాలనే కాంక్ష ఉబికి ఉబికి వస్తుంది. ఆ జిజ్ఞాస మనకు రావాలి. ఆ జిజ్ఞాస లేకుండా మనకు జ్ఞానం రాదు.

పూజ చెయ్యి, జపం చెయ్యి, ధ్యానం చెయ్యి, సత్కర్మ చెయ్యి ఎన్నిచేసినా మూలతలంపును చూసుకొంటూ ఉండు. నీవుచేసే సాధనను మూలతలంపు మీద గురిపెట్టు. నీవుచేసే సాధన వలన మూలతలంపు పల్చబడుతోందో లేదో చూసుకో. దానిని వదిలేసి నీవు ఎన్ని సాధనలు చేసిన ఒకటి లేని సున్నలతో సమానము. జ్ఞానిదేహానికి కూడా ప్రారబ్ధం ఉంటుంది. ప్రారబ్ధం విడిచిపెట్టబడిన బాణం లాంటిది. జ్ఞానికూడా దేహప్రారబ్ధం అనుభవించవలసిందే. వాడికి ఆగామిలేదు, సంచితం లేదు కాని ప్రారబ్ధం జ్ఞాని అనుభవించవలసిందే అని చెపుతారు. దీనికి భగవాన్ ఏమి చెప్పారు అంటే ప్రారబ్ధంకూడా జ్ఞానిని ఏమీచెయ్యదు అని చెప్పారు. దశరథునికి ముగ్గురు భార్యలు ఉన్నారు. దశరథుడు మరణించినప్పుడు ముగ్గురికి వైధవ్యం వస్తుందిగాని ఇద్దరికి వచ్చి ఒకరికి ఆగిపోతుందా అని అడిగారు. ముగ్గురికి వైధవ్యం వస్తుంది. అలాగే లోపల ఉన్న మిధ్యానేను పోయినప్పుడు, దేహబుద్ధి పోయినప్పుడు ఆగామి, సంచితంలతోపాటు ప్రారబ్ధంకూడా పోవలసిందే అన్నారు. మరి మీచేతిమీద కురుపు మాట ఏమిటి? శరీరం శుష్కించి పోతోంది కదా? అని అడిగారు. జ్ఞాని ప్రారబ్ధం అనుభవిస్తున్నాడు అని జ్ఞానిని చూసేవారు అనుకొంటారు, నేను ప్రారబ్ధం అనుభవిస్తున్నాను అని జ్ఞాని అనుకోడు ఎందుచేతనంటే అనుకొనేవాడు అక్కడలేడు. ఎవరైనా వచ్చి భగవాన్‌తో వారు అలా చేస్తే బాగుండును, మీరు ఇలాచేస్తే బాగుండును అనిచెప్తే వారు అలాచేయలేదని నీవు అనుకొంటున్నావు ఆచేసేదేమిటో నీవు చెయ్యవచ్చును కదా అనేవారు. భగవాన్ అంతా పాజిటివ్‌గానే చెపుతారు. నెగిటివ్ థింకింగ్ అక్కడ లేదు. అలా చేద్దాము, ఇలా చేద్దాము అని మనం అనుకొంటాము. జ్ఞాని అలా అనుకోడు. ఈశ్వరుని చేతిలో పనిముట్టులా ఉంటాడు. ఆయనకు స్వంత సంకల్పం అంటూ ఏమీ ఉండదు. ఈశ్వర సంకల్పమే ఆయన సంకల్పం. ఈశ్వరుడు ఇష్టమే ఆయన ఇష్టం. ఆయన ఎలా ఆడమంటే అలా ఆడతాడు. ఎలా పాడమంటే అలా పాడతాడు. మన సంకల్పాలు నెరవేరినా, నెరవేరకపోయినా ఈశ్వర సంకల్పం నెరవేరుతుంది. ఎందుచేతనంటే మనవి అసత్యసంకల్పాలు, ఈశ్వరునిది సత్యసంకల్పం.

భగవాన్ ఏమి చెపుతున్నారు అంటే మీకు నచ్చిన గురువును ఎన్నుకోండి, మీకు నచ్చిన మతాన్ని మీరు ఫాలో అవ్వండి. మీకు ఇష్టం వచ్చిన వృత్తిఏదో మీరు చేసుకోండి. ఎందులో ఉన్నా మీ గమ్యం మటుకు మర్చిపోకండి. ఆయన చెప్పేపద్ధతి చూడండి. ఎంత విశాల హృదయమో చూడండి. మీరు గుమ్మలూరులో ఉన్నారా, అరుణాచలంలో ఉన్నారా అనేది ప్రధానం కాదు. అజ్ఞానంలోనుండి, అవిద్యలోనుండి, దేహాభిమానంలోనుండి ఎంతవరకు బయట పడుతున్నారో అనేది చూసుకోవాలి. మనం ఈ లోకంలోనికి ఏపని నిమిత్తం వచ్చామో అది మర్చిపోవద్దు.


అజ్ఞానంలో నుండి, దేహబుద్ధిలోనుండి బయటకు రావటానికి సర్వవిధాల ప్రయత్నం చేయండి. ఒకవేళ ఇతరులతో మాట్లాడుతూ ఉన్నా, నీవు ఏపని చేస్తున్నా, దైనందిన జీవితంలో నీ వ్యవహారం అంతాకూడా అజ్ఞానంలో నుండి బయట పడటం మీద కేంద్రీకరించాలి. దేవుడు ఉన్నాడో, లేదో నీకు తెలియదు. నీకు మనస్సు తెలుస్తోంది, దేహం తెలుస్తోంది. నీవు నిజమైన సాధకుడవు ఎప్పుడు అవుతావు అంటే నీకు తెలిసిన దేహాన్ని, మనస్సును అజ్ఞానంలో నుండి విడుదల పొందటానికి మేగ్జిమమ్ ఉపయోగించాలి. అజ్ఞానంలోనుండి బయటకు రావటానికి నీ శరీరాన్ని, మనస్సును ఉపయోగించకుండా వాటితో ఏదో సాధిస్తావు అనుకో అవి అన్నీ స్వప్నసమానము. నీకు తలంపు వచ్చినప్పుడు దేహం వస్తుంది. గాఢనిద్రలో నీకు తలంపులు లేవు అక్కడ నీకు దేహం గొడవలేదు. నీ తలంపు ఎంతనిజమో దేహంకూడా అంతే నిజం, చావు కూడా అంతేనిజం, పుట్టుకకూడా అంతే నిజం. ఈ తలంపులు అన్నీ మూలతలంపు మీద ఆధారపడి ఉన్నాయి. దానిని నీవు పరిష్కరించుకోవాలి. ఎవరోవచ్చి దానిని పరిష్కారం చేసిపెడతారని కనిపెట్టుకొని ఉండవద్దు. దానిని తొలగించుకోవటానికి నీవు ప్రయత్నం చేస్తూ ఉంటే ఈశ్వరానుగ్రహం కూడా వస్తుంది. మావనజన్మ వచ్చింది. రోజూ అవకాశాలు రావు. వచ్చిన అవకాశం విడిచిపెట్టుకోవద్దు. ఈ అవకాశం ఉపయోగించుకొని ఈ దేహం ఉండగానే అజ్ఞానంలోనుండి బయటకు రావటానికి ప్రయత్నం చెయ్యి. నీవు మేడపైకి వెళ్ళాలి అనుకో మేడమెట్లు చూస్తూ కూర్చొంటే పైకి వెళ్ళలేవు. నెమ్మదిగా ఒకో మెట్టు, ఒకో మెట్టు పాకగా పాకగా పైకి వెళతావు. అలాగే నీవు నెమ్మదిగా ప్రయత్నం చేసినా మొత్తం మీద ప్రయత్నం ప్రారంభించు. అజ్ఞానంలోనుండి బయటకు రావటానికి ప్రయత్నం ప్రారంభించు. తప్పటడుగులు వేయవద్దు. నెమ్మదిగా వెళ్ళినా నిదానంగా వెళ్ళు, స్థిరంగా వెళ్ళు.

ధర్మాన్ని ఆచరించేవాడికిగాని పశుబుద్ధి, దేహబుద్ధి నశించదు. ధర్మాన్ని ఆచరించేటప్పుడు మన అహంభావన కలుగజేసుకొంటుంది అప్పుడు దానిని తీసి ఒక ప్రక్కన పెట్టి మన పని మనం చేయాలి. మన అమ్మ మంచిది కాకపోయినా తల్లిని గౌరవించమని భగవంతుడు చెప్పాడు కాబట్టి గౌరవించు. నీ అహంకారము ఏమి చెపుతుంది అంటే మంచిదికాదు. గౌరవించవద్దు అని చెపుతుంది. దానిని తీసి ఒక ప్రక్కన పెట్టి అహంకారం చేసే ప్రేరణను వదిలివేసి, దేవుడి మాటను గౌరవించి దేవుడు చెప్పినది ఆచరిస్తే నీకు దేవుడు దొరుకుతాడు. ఈ మార్గాలు అన్నీ నీకు ఇష్టంలేకపోతే భగవంతుడిని ప్రేమించు. మిథ్యానేనుతో పోరాటం అక్కరలేదు, మిథ్యానేను జ్ఞాపకం రానంతగా భగవంతుడిని ప్రేమించు. మాట్లాడితే భగవంతుడి గురించి మాట్లాడు, జీవిస్తే భగవంతుడి కోసమే జీవించు అలా ఉంటే మిథ్యానేను దానంతట అదే రాలిపోతుంది. భగవంతుడికి భక్తుడిమీద ఎంతప్రేమ ఉంటుంది అంటే భారత యుద్ధంలో కృష్ణుడు ఆయుధం పట్టనని చెపుతాడు. కాని భక్తుడిని రక్షించటంకోసం తన మాటను వదిలేసి ఆయుధం పట్టుకొని భీష్ముని మీదకు వెళతాడు. తన గౌరవంపోయినా భక్తుడిని రక్షించాలి అది భగవంతుడికి భక్తుని మీద ఉన్న ప్రేమ.




అరుణగిరి


అరుణాచలంలో శ్రీ నాన్నగారు ఆశ్రమం



శ్రీ రమణాశ్రమం, తిరువన్నామలై



ఆంధ్రాశ్రమం, తిరువన్నామలై



శ్రీ రమణ క్షేత్రం, జిన్నూరు

REGISTERED NEWS PAPER

RNI NO. APTEL/1999/1667-POSTAL REGN.NO. AP/VJA/32/5/2000




To

A. Lakshmi
Plot No. 150, Rao & Raju Colony
Banjara Hills, Road No. 2
HYDERABAD - 500 034

*If undelivered please return to :*

**RAMANA BHASKARA**
SRI RAMANA KSHETRAM,
**JINNURU - 534 265.** W.G. Dt. A.P.

Editor, Printer, Publisher : **P.S. RAMA RAJU**
Lakshmi Modern Rice Mill, Ullamparru, PALAKOL - 534 260. W.G. Dt. ☎ : 08814-24589, 24689
Printed at : **SHRIRAM GRAPHICS**, Bank Street, PALAKOL - 534 260. W.G. Dt. ☎ : 22438, 24278